


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 05 సంచిక : 81 | మంగళవారం 21 ఏప్రిల్ 2026 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## కాళేశ్వరంలో సీఎం రేవంత్ సంచలన శపథం


### కేసీఆర్, జీవన్ రెడ్డి ఇద్దరిపైనా నిప్పులు


2 లో

**న్యూస్ డెస్క్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, రాజకీయ మార్పులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యుద్ధం ప్రకటించారు. మేడిగడ్డ సందర్శన అనంతరం నస్తూర్‌పల్లి బహిరంగ సభలో మాట్లాడిన ఆయన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ మారిన జీవన్ రెడ్డిపై మునుపెన్నడూ లేని విధంగా విరుచుకుపడ్డారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడంపై రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎవరూ ఆకలితో ఉండకూడదు

### ప్రతి ఒక్కరి కడుపు నిండాలన్నదే లక్ష్యం!


2 లో

**న్యూస్ డెస్క్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు అన్న క్యాంటీన్ల ప్రాధాన్యతను వివరించారు. రాష్ట్రంలో ఎవరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి కడుపు నిండేలా చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అన్న క్యాంటీన్ల ఆలోచనకు ప్రేరణగా ఎన్టీఆర్ తిరుమలలో ప్రారంభించిన అన్నప్రసాదం కార్యక్రమాన్ని గుర్తుచేశారు. పేదలకు కేవలం దానం చేయడం కాకుండా.. గౌరవప్రదమైన వాతావరణంలో శుభ్రమైన, నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే ఈ పథకం ప్రత్యేకత సీఎం పేర్కొన్నారు.

## జపాన్‌లో 7.4 తీవ్రతతో భారీ భూకంపం



2 లో

## 100 అడుగుల లోయలో పడ్డ బస్సు

### 15 కి చేరిన మృతుల సంఖ్య


2 లో

**న్యూస్ డెస్క్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** జమ్మూ కాశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 15 కి చేరినట్టు అధికారులు తెలిపారు. అలాగే మరో 13 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఉధంపూర్ జిల్లాలోని రామనగర్ నుంచి ఉధంపూర్ పట్టణానికి వెళ్తున్న ప్రయాణికుల బస్సు, కాఘోట్ గ్రామం సమీపంలో ఒక ప్రమాదకరమైన మలుపు వద్ద అదుపుతప్పి లోతైన లోయలో పడిపోయింది.

## ఎమ్మెల్యే పదవికి రాజీమానా చేస్తా

### ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



2 లో

# తెలంగాణ పునర్నిర్మాణ పోరాటం మళ్ళీ చేయాల్సిందే

- కాంగ్రెస్ పాలనపై ఘాటు విమర్శలు
- కరెంట్ మీటర్లపై మళ్లీ యుద్ధ సంకేతాలు
- రైతుల కోసం మళ్లీ పోరాటం అంటున్న కేసీఆర్
- గ్యారంటీలపై కాంగ్రెస్‌ను నిలదీసిన బీఆర్ఎస్
- ప్రజలందరూ ఒక్కటిగా రావాలన్న పిలుపు
- జీవన్ రెడ్డి ఎంట్రీతో బీఆర్ఎస్‌కు బూస్ట్
- కరీంనగర్‌లో బీఆర్ఎస్ బలం పెరిగిందా?
- హైడ్రాపై కేసీఆర్ తీవ్ర హెచ్చరికలు
- టీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందా?



**న్యూస్ డెస్క్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ అధినేత విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రజలకు పనికొచ్చే పని ఒక్కటి కూడా లేకపోగా.. కూల్చివేతలు, కాల్చివేతలు, పోలీసుల దాడులు, ఎదురు మాట్లాడితే వారిని పట్టుకుపోవడమే ఉందని విమర్శించారు. ఇది అసలు రాజకీయమా అని ప్రశ్నించారు. జగిత్యాలలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఏం జరుగుతుందని ప్రశ్నించారు. ఈ సందర్భంలో ప్రజల మంచిని కోరే ప్రతి ఒక్కరూ ఒక్కటి కావాల్సిందేనని పిలుపునిచ్చారు. తెలంగాణ పునర్నిర్మాణ యజ్ఞం మళ్లీ చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

ఆనాడు బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయ కరెంటు మోటార్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ ఒత్తిడి తీసుకొచ్చారని కేసీఆర్ గుర్తుచేశారు. నా ప్రాణం పోయినా సరే మీటర్లు పెట్టనని చెప్పానని.. అన్నట్లుగానే పెట్టలేదని తెలిపారు. మీటర్లు పెట్టకపోతే 30 వేల కోట్లు కట్ చేస్తానని మోదీ అన్నాడని.. కట్ చేశాడని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే 30 వేల కోట్ల ఆదాయాన్ని వదులుకుని కూడా తెలంగాణలో కరెంటు మీటర్లు పెట్టనివ్వలేదని చెప్పారు. కానీ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ వెళ్లి కరెంటు మీటర్లు పెట్టేందుకు ఒప్పుకున్నారని తెలిపారు. అప్పటి రూ.30వేల కోట్లు తీసుకుని.. వ్యవసాయ కరెంటు మీటర్లకు మోటర్లు పెట్టేందుకు సంతకం పెట్టారని పేర్కొన్నారు. తొందరలోనే రాష్ట్రంలోని వ్యవసాయ కరెంట్ మోటార్లకు మీటర్లు వస్తాయని తెలిపారు. వీటిని ఎదుర్కొందామా.. మీటర్లు పెట్టకుండా యుద్ధం చేస్తామా అని పిలుపునిచ్చారు.

రైతులు మంచిగుండాలి.. వ్యవసాయం మంచిగుండాలి.. పల్లెలు బాగుండాలి.. వృత్తి పనులు బాగుండాలనే కదా మనం అంటున్నామని కేసీఆర్ తెలిపారు. తమ ప్రభుత్వంలో యాదవులకు గొర్రెలు ఇప్పించామని.. ఇప్పుడొస్తున్నాయా అని ప్రశ్నించారు. మత్స్యకారుల కోసం చేప పిల్లలు పంపిణీ చేశామని.. ఇప్పుడు ఇస్తున్నారా అని అడిగారు. బీడీ కార్మికులు ఎవరూ అడగకుండానే.. పెన్షన్లు ఇచ్చామని గుర్తుచేశారు. భారతదేశంలో ఎవరైనా అలా ఇస్తారా అని ప్రశ్నించారు. కానీ కాంగ్రెసోళ్లు పెన్షన్లు పెంచుతామని ఎగ్గొట్టారని అన్నారు. అదొక్కటే కాదని.. ఇంట్లో ఉన్న ఆడబిడ్డకు మహాలక్ష్మి అని రూ.2500 ఇస్తామని చెప్పారని.. ఇచ్చారా అని ప్రశ్నించారు. స్కూటీలు ఇచ్చారా అని అడిగారు. అలా ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఏ ఒక్కటి ఇవ్వలేదని చెప్పారు.ు తెలంగాణలో ఏం జరుగుతుందని కేసీఆర్ ప్రశ్నించారు. ఈ సందర్భంలో ప్రజల మంచిని కోరే ప్రతి ఒక్కరూ ఒక్కటి కావాల్సిందేనని పిలుపునిచ్చారు. మళ్లీ తెలంగాణ పునర్నిర్మాణ యజ్ఞం ప్రారంభం కావాల్సిందేనని స్పష్టం చేశారు.

మిగతాది 2 లో

## డ్వాక్రా మహిళలకు తీపికబురు

### రుణాల పరిమితిని భారీగా పెంచుతూ నిర్ణయం



2 లో

**న్యూస్ డెస్క్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** చిన్నతరహా వ్యాపారాలు చేయాలనుకునే డ్వాక్రా మహిళలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా 'స్త్రీనిధి' ద్వారా అందించే రుణ పరిమితిని భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఇస్తున్న రుణాలకు అదనంగా మరిన్ని నిధులు కేటాయించడం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఇందులో భాగంగా ప్రస్తుతం ఇస్తున్న రూ.లక్ష రుణానికి అదనంగా మరో రూ.2 లక్షల వరకు రుణం అందనుంది. ఇక ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రత్యేక రాయితీతో కూడిన రూ.4 లక్షల వరకు రుణం పొందే అవకాశం కల్పించారు.

## ఉపాధి హామీ పనుల్లో బాంబు పేలుడు

### ముగ్గురు కూలీలకు గాయాలు



2 లో

**న్యూస్ డెస్క్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** విజయనగరం జిల్లాలో ఉపాధి హామీ పనుల వద్ద ఒక్కసారిగా పేలుడు సంభవించడం తీవ్ర కలకలం రేపింది. కాటకాపల్లి గ్రామ శివారులోని చెరువులో కూలీలు మట్టి పెకిలిస్తుండగా భూమిలో ఉన్న నాటుబాంబు ఒక్కసారిగా పేలిపోయింది.

## బీఆర్ఎస్‌లో వర్గపోరు!

### హరీశ్ రావు ఎపిసోడ్‌పై కాంగ్రెస్ ఎటాక్



2 లో

**న్యూస్ డెస్క్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** కేసీఆర్ జగిత్యాల సభ వేళ మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ పర్యటన రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. దాదాపు ఏడాది తర్వాత బహిరంగ సభకు పార్టీ అధినేత వస్తున్న సమయంలో హరీశ్ రావు హుటాహుటీన హస్తిన బాట పట్టడం ఇటు బీఆర్ఎస్ శ్రేణులతో పాటు పొలిటికల్ కారిడార్ లో రకరకాల ఊహాగానాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ లోని పరిణామాలపై కాంగ్రెస్ ఎటాక్ మొదలు పెట్టింది. హరీశ్ రావు ఢిల్లీ పర్యటనపై తాజాగా స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ బీఆర్ఎస్‌లో వర్గపోరు మొదలైందని ఆరోపించారు. హరీశ్ రావు ఢిల్లీ పర్యటన వెనుక ఆంతర్యం ఏంటో జగిత్యాల సభలో కేసీఆర్, కేటీఆర్ ప్రకటించాలన్నారు. ఇక మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రియాక్ట్ అవుతూ హరీశ్ రావు రాజకీయ జీవితం ప్రమాదంలో ఉందని కామెంట్ చేశారు.

# ఎమ్మెల్యే పదవికి రాజీమానా చేస్తా.. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**న్యూస్ డెస్క్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. క్రషర్ దందాలో తనకు వాటా ఉందని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. కార్యకర్త స్థాయి నుంచి ప్రభుత్వ విప్‌గా ఎదిగానని ఎమ్మెల్యే కాకముందు నుంచే తాను వ్యాపారం చేశానన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. నేను వందల కోట్ల ఆస్తిపరుడినని నాకే బొచ్చుడు ఆస్తులు ఉన్నాయన్నారు. పది రూపాయల తన సంపాదనలో తొమ్మిది రూపాయలు పేదల కోసమే ఖర్చు చేస్తానని, నా భూములే ఇతరులకు దానం చేస్తానన్నారు. నాకు అక్రమ సంపాదన అవసరంలేదన్నారు. కాగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం రాజాపేట మండలంలోని చల్లూరు గుట్టలో బీర్ల ఐలయ్య అక్రమ మైనింగ్, స్టోన్ క్రషర్ కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయని దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా స్పందించిన ఐలయ్య ఈ వ్యాఖ్యలు చేశారు.

# తెలంగాణ పునర్నిర్మాణ పోరాటం మళ్ళీ చేయాల్సిందే

మొదటి పేజీ తరువాయి



దాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. పోరాటం చేయాల్సిందేనని.. వాళ్లను నిలదీయాల్సిందేనని అన్నారు. తెలంగాణ ప్రజలు గెలిచి నిలవాల్సిందేనని స్పష్టం చేశారు.

సీనియర్ నేత టీ.జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరడంపై అధినేత కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. జగిత్యాలలో జరిగిన భారీ బహిరంగ సభలో జీవన్ రెడ్డికి కండువా కప్పి ఆహ్వానించిన అనంతరం కేసీఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వ్యక్తిత్వాన్ని, ఆయనతో ఉన్న అనుబంధాన్ని కేసీఆర్ కొనియాడారు. జీవన్ రెడ్డి నిర్ణయాన్ని కేసీఆర్ "గుండె ధైర్యంతో కూడిన నిర్ణయం"గా అభివర్ణించారు. వ్యక్తిగత లాభం కంటే తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని భావించి జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి వచ్చారని కేసీఆర్ పేర్కొన్నారు. ఆయన ప్రజా జీవితం ఎంతో మంది రాజకీయ నాయకులకు ఆదర్శమని, ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. "మేమిద్దరం 45 ఏళ్లుగా స్నేహితులం. గతంలో రాజకీయంగా విభిన్న ధ్రువాల్లో ఉన్నా, మా మధ్య స్నేహం మాత్రం అలాగే ఉంది. రాజకీయ విభేదాలు ఉన్నా ఎప్పుడూ కలిసే ఉన్నాం" అని కేసీఆర్ భావోద్వేగంగా మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా జీవన్ రెడ్డి ఇకనుంచి రాష్ట్రం మొత్తంలో బీఆర్ఎస్‌కు పనిచేయబోతున్నారని కేసీఆర్ సంచలన ప్రకటన చేశారు.

కరీంనగర్ జిల్లాలో తిరుగులేని బలం..


జీవన్ రెడ్డి చేరికతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ కేడర్‌లో కొత్త ఉత్సాహం వచ్చిందని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. జీవన్ రెడ్డికి కేవలం జిల్లాలోనే కాకుండా మొత్తం తెలంగాణ రాజకీయాల మీద మంచి అవగాహన, పట్టు ఉన్నాయని ప్రశంసించారు. ఆయనకున్న అశేష కేడర్, అనుభవంతో రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని కేసీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనే, మరోవైపు జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేతను పక్కన చేర్చుకోవడం ద్వారా కేసీఆర్ తన రాజకీయ వ్యూహాన్ని జగిత్యాల గడ్డపై మరోసారి ప్రదర్శించారు.

"తెలంగాణ ఇంటి పార్టీ టీఆర్ఎస్‌దే మళ్ళీ అధికారం.. పేదలను కడుపులో పెట్టుకుని చూసుకునే బాధ్యత నాది" అంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం జగిత్యాలలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, మరోసారి 'టీఆర్ఎస్' అనే పదాన్ని ప్రస్తావించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. ప్రస్తుత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న హైడ్రా వ్యవస్థపై కేసీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చుతూ భయాందోళనలకు గురిచేస్తున్నారు. మేము మళ్ళీ అధికారంలోకి రాగానే ఈ హైడ్రా అనే వ్యవస్థనే ఎత్తిపారేస్తాం అని కేసీఆర్ ప్రకటించారు. హైడ్రా బాధితులను ఆదుకుంటామని, మళ్ళీ గులాబీ జెండా ఎగరగానే పేదలకు అండగా నిలబడి వారిని కడుపులో పెట్టుకుని చూసుకుంటామని భరోసా ఇచ్చారు.

చంద్రబాబుపై విమర్శల బాణాలు..

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీరుపై కూడా కేసీఆర్ తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. గతంలో చంద్రబాబు హయాంలో జరిగిన కరెంట్ ఛార్జీల పెంపు, బషీర్‌బాగ్ కాల్పుల ఘటనలను గుర్తు చేస్తూ, తెలంగాణ వ్యతిరేక శక్తులతో ప్రస్తుత ప్రభుత్వం చేతులు కలిపిందని ఆరోపించారు. పార్టీ పేరు మార్పు తర్వాత మళ్ళీ టీఆర్ఎస్ ప్రస్తావన తెస్తూ కేడర్‌లో ధైర్యం నింపారు. టీఆర్ఎస్ జెండా ఎప్పుడూ తెలంగాణ గడ్డపైనే ఉంటుంది. మళ్ళీ మనమే అధికారంలోకి వస్తాం. పేదలు, రైతులు పడుతున్న బాధలను చూడలేకపోతున్నాను.. వారందరికీ న్యాయం జరగాలంటే మళ్ళీ మన ప్రభుత్వం రావాలి అని పిలుపునిచ్చారు. ఈ సభతో జగిత్యాల పట్టణం మొత్తం గులాబీమయంగా మారింది. సీనియర్ నేత జీవన్ రెడ్డి చేరికతో పాటు కేసీఆర్ చేసిన ఈ ఘాటు వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి.

# కాళేశ్వరంలో సీఎం రేవంత్ సంచలన శపథం.. కేసీఆర్, జీవన్ రెడ్డి ఇద్దరిపైనా నిప్పులు



**న్యూస్ డెస్క్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, రాజకీయ మార్పులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యుద్ధం ప్రకటించారు. మేడిగడ్డ సందర్శన అనంతరం నస్తూర్‌పల్లి బహిరంగ సభలో మాట్లాడిన ఆయన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ మారిన జీవన్ రెడ్డిపై మునుపెన్నడూ లేని విధంగా విరుచుకుపడ్డారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడంపై రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో ఒక మాదిగ బిడ్డ అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పదవి ఇస్తే ఓర్వలేకనే జీవన్ రెడ్డి పార్టీ మారారు. కాంగ్రెస్ ఆయనకు ఎన్నో అవకాశాలు ఇచ్చినా, కుట్రపూరితంగా బీఆర్ఎస్‌లో చేరారు అని మండిపడ్డారు. వచ్చేసారి కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా కూడా రాకుండా చేస్తా.. అప్పుడు జీవన్ రెడ్డి ఏ పార్టీలో చేరుతారో చూస్తా అని ఎద్దేవా చేశారు. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కడితే అది కొన్ని నెలల్లోనే కూలేశ్వరం అయింది. తెలంగాణను పదేళ్లు లూటీ చేసిన కేసీఆర్‌ను ఉరి తీసినా తప్పులేదు అని సంచలన వ్యాఖ్యలు చేశారు.

భ్రమల్లో కేసీఆర్..

మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ భ్రమల్లో ఉన్నారని, ఆ కుటుంబాన్ని ఎప్పటికీ అధికారంలోకి రానివ్వనని శపథం చేశారు. రాబోయే ఎన్నికల ఫలితాలపై రేవంత్ రెడ్డి స్పష్టమైన సవాల్ విసిరారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఘోరీ కట్టామని, 2029లో కూడా అదే పునరావృతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి, డి.శ్రీనివాస్ కలిసి కాంగ్రెస్‌ను ఎలా అధికారంలోకి తెచ్చారో.. ఇప్పుడు నేను, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కలిసి రెండోసారి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తాం అని కార్యకర్తల సాక్షిగా ప్రకటించారు. పాలకుల చిల్లర మాటలు అంటూ కేసీఆర్ చేసిన విమర్శలకు, రేవంత్ రెడ్డి తనదైన శైలిలో కౌంటర్ ఇవ్వడంతో తెలంగాణ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

# బీఆర్ఎస్‌లో వర్గపోరు! హరీశ్ రావు ఎపిసోడ్‌పై కాంగ్రెస్ ఎటాక్

**న్యూస్ డెస్క్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** కేసీఆర్ జగిత్యాల సభ వేళ మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ పర్యటన రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. దాదాపు ఏడాది తర్వాత బహిరంగ సభకు పార్టీ అధినేత వస్తున్న సమయంలో హరీశ్ రావు హుటాహుటీన హస్తిన బాట పట్టడం ఇటు బీఆర్ఎస్ శ్రేణులతో పాటు పొలిటికల్ కారిడార్ లో రకరకాల ఊహాగానాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ లోని పరిణామాలపై కాంగ్రెస్ ఎటాక్ మొదలు పెట్టింది. హరీశ్ రావు ఢిల్లీ పర్యటనపై తాజాగా స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ బీఆర్ఎస్?లో వర్గపోరు మొదలైందని ఆరోపించారు. హరీశ్ రావు ఢిల్లీ పర్యటన వెనుక ఆంతర్యం ఏంటో జగిత్యాల సభలో కేసీఆర్, కేటీఆర్ ప్రకటించాలన్నారు. ఇక మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రియాక్ట్ అవుతూ హరీశ్ రావు రాజకీయ జీవితం ప్రమాదంలో ఉందని కామెంట్ చేశారు.

బీజేపీ వైపు హరీశ్ రావు చూపు!:

ఈ అంశంపై జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ స్పందిస్తూ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. జీవన్ రెడ్డి రాకతో బీఆర్ఎస్?లో ముసలం మొదలైందని హరీశ్ రావుతో పాటు బీజేపీ వైపు ఎమ్మెల్యేలు చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఢిల్లీ వెళ్లిందే బీజేపీ నేతలను కలవడానికి అని హాట్ కామెంట్స్ చేశారు. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాల దృష్ట్యా హరీశ్ రావు త్వరలో బీజేపీ గూటికి చేరబోతున్నారని చాలా కాలంగా ప్రచారం జరుగుతున్న వేళ సంజయ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి.

బీఆర్ఎస్ రియాక్ట్:

అయితే హరీశ్ రావు పర్యటనపై బీఆర్ఎస్ స్పందించింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకే పార్టీ త్రిసభ్య కమిటీ ఢిల్లీ పర్యటనకు వెళ్లిందని ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రతినిధుల బృందంలో హరీశ్ రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఉన్నారని ఏప్రిల్ 22వ తేదీన తెలంగాణ హైకోర్టులో కాళేశ్వరం కమిషన్‌పై వెలువడనున్న తుది తీర్పు, అలాగే ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసుల నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన కార్యాచరణను సిద్ధం చేసేందుకు వీరు ఢిల్లీ వెళ్లారని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో ఈ కమిటీ ప్రత్యేకంగా సమావేశమైందని కాళేశ్వరం కమిషన్ పై హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాలపై, అలాగే ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో న్యాయపరంగా తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై లాయర్లతో చర్చించనున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది.

# జపాన్‌లో 7.4 తీవ్రతతో భారీ భూకంపం

**న్యూస్ డెస్క్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** ఉత్తర జపాన్ తీరంలో సోమవారం సాయంత్రం అత్యంత శక్తివంతమైన భారీ భూకంపం సంభవించింది. జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.4 (కొన్ని చోట్ల 7.5గా సవరించారు) గా నమోదైంది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 4:53 గంటలకు ఉత్తర ఇవాటే ప్రిఫెక్చర్ సమీపంలోని పసిఫిక్ సముద్ర గర్భంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు.

సునామీ హెచ్చరికలు జారీ

ఈ భూకంపం నేపథ్యంలో అధికారులు ఇవాటే, ఆమోరి, హోక్కైడో ప్రిఫెక్చర్లకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. సముద్రపు అలలు సుమారు 3 మీటర్ల (10 అడుగుల) ఎత్తులో ఎగసి పడే అవకాశం ఉందని హెచ్చరించారు. తీర ప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వెంటనే ఎత్తైన ప్రదేశాలకు, సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. "తక్షణమే ఖాళీ చేయండి!" అనే హెచ్చరికలు టీవీ స్క్రీన్లపై దర్శనమిస్తున్నాయి. భూకంప కేంద్రానికి వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజధాని టోక్యోలో కూడా భారీ భవనాలు ఊగిపోయాయి.

జపాన్ అంతటా బలమైన ప్రకంపనలు నమోదయ్యాయి. భద్రతా దృష్ట్యా టోక్యో - ఆమోరి మార్గంలో నడిచే బుల్లెట్ రైలు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు. హచినోహే వంటి ఓడరేవుల నుండి షిప్పులు సముద్రం లోపలికి వెళ్తున్నాయి. జపాన్ ప్రధాన మంత్రి సనే తకైచి ఇప్పటికే ఒక అత్యవసర టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి, సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అలలు పదేపదే వచ్చే అవకాశం ఉన్నందున, హెచ్చరికలు తొలగించే వరకు ఎవరూ సురక్షిత ప్రాంతాలను వదలవద్దని అధికారులు సూచించారు.

# ఉపాధి హామీ పనుల్లో బాంబు పేలుడు ముగ్గురు కూలీలకు గాయాలు




**న్యూస్ డెస్క్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** విజయనగరం జిల్లాలో ఉపాధి హామీ పనుల వద్ద ఒక్కసారిగా పేలుడు సంభవించడం తీవ్ర కలకలం రేపింది. కాటకాపల్లి గ్రామ శివారులోని చెరువులో కూలీలు మట్టి పెకిలిస్తుండగా భూమిలో ఉన్న నాటుబాంబు ఒక్కసారిగా పేలిపోయింది. ఈ ప్రమాదంలో బాంబులోని గాజు పెంకులు ఒంటికి గుచ్చుకోవడంతో ముగ్గురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో తోటి కూలీలు భయాందోళనతో పరుగులు తీశారు.

అడవి పందుల వేట కోసం..

ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు గాయపడిన వారిని అత్యవసర చికిత్స నిమిత్తం పెందుర్తిలోని సివిల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స అందుతోంది. పేలుడు తీవ్రత తక్కువగా ఉండటంతో పెద్ద ప్రాణనష్టం తప్పిందని అధికారులు అంటున్నారు. అడవి పందుల వేట కోసం ఎవరో అమర్చిన నాటుబాంబు మట్టిలో ఉండిపోయి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# డ్వాక్రా మహిళలకు తీపికబురు

## రుణాల పరిమితిని భారీగా పెంచుతూ నిర్ణయం




**న్యూస్ డెస్క్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** చిన్నతరహా వ్యాపారాలు చేయాలనుకునే డ్వాక్రా మహిళలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా 'స్త్రీనిధి' ద్వారా అందించే రుణ పరిమితిని భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఇస్తున్న రుణాలకు అదనంగా మరిన్ని నిధులు కేటాయించడం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఇందులో భాగంగా ప్రస్తుతం ఇస్తున్న రూ.లక్ష రుణానికి అదనంగా మరో రూ.2 లక్షల వరకు రుణం అందనుంది. ఇక ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రత్యేక రాయితీతో కూడిన రూ.4 లక్షల వరకు రుణం పొందే అవకాశం కల్పించారు. అయితే, గతంలో తీసుకున్న రుణాలను సక్రమంగా నిర్ణీత గడువులోగా చెల్లిస్తున్న మహిళలకు మాత్రమే ఈ అదనపు రుణాలు మంజూరు చేయనున్నారు. రేపటి నుంచి నెల రోజుల పాటు 'సెర్ప్' అధికారులు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి గ్రామ సంఘం నుంచి వ్యాపార ఆసక్తి కలిగిన 15 మంది మహిళలను అధికారులు ఎంపిక చేసి, వారికి రుణ మంజూరు ప్రక్రియలో సాయం అందించనున్నారు.

# 100 అడుగుల లోయలో పడ్డ బస్సు 15 కి చేరిన మృతుల సంఖ్య

మొదటి పేజీ తరువాయి




ఈ ప్రమాదం ఉదయం 10 గంటల సమయంలో చోటుచేసుకుంది. కొండ ప్రాంతాల్లో ఉండే ప్రమాదకరమైన మలుపును తిరుగుతున్న సమయంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు లోయలోకి దూసుకెళ్లింది. సుమారు 100 అడుగుల పైనుంచి పడటంతో బస్సు పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయక చర్యలు ప్రారంభించారు. అనంతరం పోలీసులు, ఆర్మీ మరియు విపత్తు నిర్వహణ బృందాలు రంగంలోకి దిగి శిథిలాల నుంచి బాధితులను వెలికితీశారు. ప్రస్తుతం గాయపడిన వారిని ఉధంపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఘోర ప్రమాదంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ స్పందిస్తూ..తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన తన ట్వీట్‌లో "ఉధంపూర్‌లో జరిగిన ఘోరమైన బస్సు ప్రమాదం పట్ల తీవ్రంగా విచారిస్తున్నాను. ఈ ఘటనలో అమూల్యమైన ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరం. ఈ దుఃఖ సమయంలో మృతుల కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని, ఈ ప్రమాదం వల్ల ప్రభావితమైన వారందరికీ మనోధైర్యం కలగాలని ప్రార్థిస్తున్నాను" అని రాజ్ నాథ్ సింగ్ రాసుకొచ్చారు.

# ఎవరూ ఆకలితో ఉండకూడదు ప్రతి ఒక్కరి కడుపు నిండాలన్నదే లక్ష్యం!

మొదటి పేజీ తరువాయి



'అన్న క్యాంటీన్లలో ప్రత్యేక క్యాంపస్, కాంపౌండ్ వాల్, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాము. కేవలం రూ.5కే ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటలా భోజనం అందించడం ద్వారా ఆటో డ్రైవర్లు, కూలీలు, రోడ్లు శుభ్రం చేసే కార్మికులు వంటి సామాన్య ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతోంది. ఇస్కాన్ ఫౌండేషన్ సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా రుచికరమైన, నాణ్యమైన ఆహారం అందిస్తున్నాం. ప్రస్తుతం రాష్ట్రంలో 269 అన్న క్యాంటీన్లు పనిచేస్తున్నాయి. ఇటీవల 62 కొత్త క్యాంటీన్లు ప్రారంభించాము. త్వరలో మరో 5 ప్రారంభించి మొత్తం సంఖ్యను 274కి పెంచుతాం' అని సీఎం చంద్రబాబు చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు మూడు పూటలా ఉచిత భోజనం అందించేందుకు రూ.76 లక్షలు విరాళంగా ఇచ్చిన నారా భువనేశ్వరిని సీఎం అభినందించారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా సహకరించాలని పిలుపునిచ్చారు. ఒక పూట భోజనం లేదా ఒక రోజు క్యాంటీన్ ఖర్చును భరించడం ద్వారా ఈ అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాకుండా, ప్రజలందరూ కలిసి ముందుకు తీసుకెళ్లాల్సిన స్ఫూర్తిదాయక వేదిక అని చంద్రబాబు అన్నారు. ప్రజలను ఆదుకునే కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలని, కేవలం ఆహారం అందించడమే కాకుండా వారి అభివృద్ధి కోసం దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమని తెలిపారు. సమాజంలో ఉన్న ఆర్థిక అసమానతలను తగ్గించే దిశగా అందరూ ఆలోచించాలని, అదే నిజమైన ప్రజాస్వామ్యం అని సీఎం పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌ను 'అన్నపూర్ణ'గా నిలబెట్టాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్రంలో ఎవరూ ఆకలితో అలమటించకూడదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గతంలో అన్న క్యాంటీన్లు మూసివేయబడిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. పేదల కోసం పనిచేసే కార్యక్రమాలు ఎప్పటికీ ఆగకూడదన్నారు. రాష్ట్రంలోని పేదలను ఆదుకోవడానికి అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు. నేడు సీఎం చంద్రబాబు పుట్టినరోజు. ఈ సందర్భంగా విజయవాడ పటమటలోని అన్న క్యాంటీన్‌ను సీఎం దంపతులు సందర్శించారు. ఇద్దరూ స్వయంగా పేదలకు అల్పాహారం వడ్డించి.. భోజనం చేయడం విశేషం.

# ఆస్తుల వివరాల్లో తేడాలు: టీవీకే చీఫ్ విజయ్‌కు మద్రాస్ హైకోర్టు షాక్



**న్యూస్ డెస్క్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** తమిళ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధ్యక్షుడు, ప్రముఖ నటుడు విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురైంది. ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తుల వివరాల వెల్లడికి సంబంధించి దాఖలైన పిటిషన్‌ను విచారించిన కోర్టు, విజయ్‌కు నోటీసులు జారీ చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంలో సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లలో ఆస్తుల వివరాల వెల్లడిపై స్పష్టత లేదని, ముఖ్యంగా రెండు వేర్వేరు నియోజకవర్గాల అఫిడవిట్లలో భారీ తేడాలు ఉన్నాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పెరంబూర్, తిరుచ్చి తూర్పు నియోజకవర్గాలకు సంబంధించి దాఖలు చేసిన అఫిడవిట్లలో ఆస్తుల విలువ, వివరాలు ఒకదానికొకటి పొంతన లేకుండా ఉన్నాయని కోర్టు గుర్తించింది. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన ఉన్నత న్యాయస్థానం, అఫిడవిట్లలో ఇలాంటి పొరపాట్లు ఉండటంపై అసహనం వ్యక్తం చేసింది. బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి, ప్రజల్లోకి వెళ్తున్న నేతలు ఆస్తుల విషయంలో పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేసింది.

రాజకీయ ప్రాధాన్యత..

రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం విజయ్ తన పార్టీని సిద్ధం చేస్తున్న తరుణంలో ఈ న్యాయపరమైన చిక్కులు ఎదురుకావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని కోరుతూ విజయ్‌తో పాటు ఎన్నికల కమిషన్‌కు కూడా కోర్టు నోటీసులు పంపింది. ఒకవైపు విజయ్ తమిళనాడులో పర్యటిస్తూ తన ఉనికిని చాటుకుంటుండగా, మరోవైపు ఈ అఫిడవిట్ వివాదం ప్రతిపక్షాలకు ఆయుధంగా మారే అవకాశం ఉంది. ఈ కేసుకు సంబంధించి తదుపరి విచారణను కోర్టు వాయిదా వేసింది. విజయ్ తరపు న్యాయవాదులు ఈ తేడాలపై ఎలాంటి వివరణ ఇస్తారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# వినూత్నం ఈ వివాహ ఆహ్వాన పత్రిక

## శుభలేఖపై సైబర్ భద్రత పాఠాలు

## అభినందించిన బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పులి దేవేందర్ ముదిరాజ, సభ్యులు

**వనం నాగయ్య, కెరటం న్యూస్:** ఖమ్మం జిల్లాలో ఒక పోలీస్ కానిస్టేబుల్ తన కుమార్తె వివాహ పత్రికను కేవలం ఆహ్వానానికే పరిమితం చేయకుండా, సామాజిక బాధ్యతను చాటుతూ రూపొందించిన తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. సాధారణంగా పెళ్లి పత్రికలు అంటే దైవ ప్రార్థనలు, బంధుమిత్రుల పేర్లు,విందు వినోదాల వివరాలతో నిండి ఉంటాయి.కానీ ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీ బోనగిరి నాగేశ్వరరావు ‌ఽ శ్రీమతి విజయలక్ష్మి దంపతులు తమ చిన్న కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను అత్యంత వినూత్నంగా రూపొందించారు. శుభకార్యానికి పిలుస్తూనే, సమాజాన్ని పట్టిపీడిస్తున్న సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు.

శుభలేఖలో...

సైబర్ హెచ్చరికలు

నాలుగు గోడల మధ్య జరిగే శుభకార్యం సాక్షిగా, వందలాది మందికి చేరే ఈ పత్రిక ద్వారా నాగేశ్వరరావు గారు సైబర్ భద్రతపై విలువైన సూచనలు అందించారు. పత్రికలోని ప్రతి అంగుళంలో నేటి డిజిటల్ యుగంలో పాటించాల్సిన జాగ్రత్తలను పొందుపరిచారు.

లింక్స్ పట్ల జాగ్రత్త

మెసేజ్‌లలో వచ్చే తెలియని లింక్స్‌ను క్లిక్ చేయవద్దని, అది మీ బ్యాంక్ అకౌంట్‌ను ఖాళీ చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

గిఫ్ట్‌ల ఆశ వద్దు

ఉచిత గిఫ్ట్‌ల పేరుతో లేదా విరాళాల పేరుతో ఎవరైనా అకౌంట్ వివరాలు అడిగితే నమ్మవద్దని సూచించారు.

పార్సిల్ మోసాలు

మీరు బుక్ చేయని పార్సిల్ వచ్చిందని చెప్పి, క్యాన్సిల్ చేయడానికి ఓటీపీ అడిగితే అస్సలు చెప్పవద్దని స్పష్టం చేశారు.

డిజిటల్ భద్రత

యూపీఐ, నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్స్ ఎవరికీ చెప్పవద్దని, తెలియని వ్యక్తులు పంపే క్యూఆర్ కోడ్స్‌ను స్కాన్ చేయవద్దని పత్రికలో పేర్కొన్నారు.


పెట్టుబడిమోసాలు

సోషల్ మీడియా ప్రకటనలు చూసి అత్యాశతో ఇన్వెస్ట్ చేయవద్దని, పబ్లిక్ వైఫై వాడి బ్యాంకింగ్ లావాదేవీలు చేయవద్దని హితవు పలికారు.

అవగాహనే రక్ష

సైబర్ నేరానికి గురైతే తక్షణమే 1930 కు ఫిర్యాదు చేయాలని ఈ పత్రిక ద్వారా దిశానిర్దేశం చేశారు.వృత్తిపై నిబద్ధతతో పాటు సమాజం పట్ల ఉన్న బాధ్యతను చాటుకున్న ఈ కానిస్టేబుల్ ఆలోచనను బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పులి దేవేందర్ ముదిరాజ్, సభ్యులు కొనియాడు తున్నారు. "చిన్న లింక్.. పెద్ద నష్టం చేస్తుంది" అంటూ బోనగిరి నాగేశ్వరరావు గారు ఇచ్చిన సందేశం ఇప్పుడు చర్చనీయాంశమైంది.







# కామ్రేడ్ చావా శ్రీహరి మృతి

## సంతాపం ప్రకటించిన ఎమ్మెల్సీ తాతా మధు



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** ఖమ్మం జిల్లా ముతాపురానికి చెందిన సీనియర్ నాయకులు, మాజీ విద్యార్థి నేత చావా శ్రీహరి మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర శాసనమండలి సభ్యులు, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చావా శ్రీహరి పి.డి.ఎస్.యు ఖమ్మం జిల్లా మాజీ నాయకుడిగా, 1980-81 కాలంలో ఎస్.ఆర్, బి.జి.ఎన్.ఆర్ కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా విద్యార్థి ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. ఆయన మరణం జిల్లా రాజకీయ మరియు సామాజిక రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# మంత్రి తుమ్మల వ్యాఖ్యలు నిరాధారం

## వెంటనే వెనక్కి తీసుకోవాలి..ఎంపీ వద్దిరాజు



**హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్:** వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపణలు నిరాధార మైనవని, వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. మంత్రులు తుమ్మల, అడ్లూరి లక్ష్మణ్, లోకసభ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డిలు బీఆర్ఎస్, మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అర్థంపర్థం లేనివని ఆయన కొట్టిపాడేశారు. ఎంపీ రవిచంద్ర ఢిల్లీలో సోమవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీష్ రావు ఢిల్లీ పర్యటనను ఉద్దేశించి కాంగ్రెస్ నాయకులు ఇష్టారీతిగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి ఆ పార్టీని వీడి జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు సమక్షంలో బీఆర్ఎస్ లో చేరుతుండడాన్ని తామంతా హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నామని ఎంపీ రవిచంద్ర చెప్పారు. చాలా రోజుల తర్వాత కేసీఆర్ సభ పెడుతుండడంతో కాంగ్రెస్ నాయకులు దిక్కుతోచని స్థితిలో భీతిల్లిపోతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరడం వెనుక ఉద్దేశమేమిటో విజ్ఞులైన తెలంగాణ ప్రజలకు బాగా తెలుసునని ఎంపీ వద్దిరాజు వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్,10 మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపునకు సంబంధించిన కేసుల గురించి సీనియర్ న్యాయవాదులు శేషాద్రి నాయుడు, సుందరంలను కలిసి మాట్లాడడానికి తాను, మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ మంత్రి హరీష్ రావు ఢిల్లీ రావడం జరిగిందన్నారు. హరీష్ రావు రైతన్నలకు రైతుభరోసా విడుదలలో చోటుచేసుకుంటున్న మరింత జాప్యం, మొక్కజొన్న పంటను కొనుగోలు చేయకపోవడం, ప్రభుత్వం సరిపడు యూరియా సరాఫరాలో విఫలమవ్వడాన్ని ఎత్తిచూపితే మంత్రి తుమ్మల సరైన సమాధానం చెప్పకుండా ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడడం విచారకరమని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. బీఆర్ఎస్ రాజకీయ పునర్జన్మ ఇచ్చిన విషయాన్ని మర్చిపోయి మంత్రి మాట్లాడారని, బీఆర్ఎస్, కేటీఆర్, హరీష్ రావులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకుల మాదిరిగా డబుల్ గేమ్ ఆడడం, మ్యాచ్ ఫిక్సింగ్ కు పాల్పడం తమకు రాదని, ప్రభుత్వం తీసుకువచ్చిన డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తూనే కేంద్ర మంత్రి ఇంట్లో జరిగిన విందుకు హాజరు కావడాన్ని ఎంపీ వద్దిరాజు ప్రశ్నించారు.

# సూర్యాపేటలో సీనియర్ సిటిజన్ల సేవా స్ఫూర్తి

## -బాటసారులకు మజ్జిగ పంపిణీ




**సూర్యాపేట, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** పట్టణంలో మానవత్వానికి ప్రతీకగా నిలిచే సేవా కార్యక్రమం జరిగింది. పట్టణ సీనియర్ సిటిజన్ సభ్యుల ఆధ్వర్యంలో వాణిజ్య భవన్ సెంటర్ వద్ద బాటసారులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేపట్టారు. బోనగిరి రామ్మూర్తి,భాగ్యలక్ష్మి జ్ఞాపకార్థంగా కుమారులు,కోడలు భువనగిరి విజయకుమార్ మరియు నాగలక్ష్మి. వీరి సహకారం తో,మండుతున్న ఎండల నేపథ్యంలో దాహంతో అలమటిస్తున్న ప్రజలకు చల్లని ఉపశమనం కలిగించాలనే, ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు, పాదచారులు పెద్ద ఎత్తున మజ్జిగను స్వీకరించి, నిర్వాహకుల సేవా భావాన్ని అభినందించారు. ముఖ్యంగా మధ్యాహ్న వేళలో ఈ పంపిణీ కార్యక్రమం మరింత ఉపయుక్తంగా మారింది.ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ సభ్యులు మాట్లాడుతూ, వేసవి తీవ్రతను దృష్టిలోఎఉంచుకుని ప్రజలకు ఉపశమనం కలిగించే కార్యక్రమాలు చేపట్టడం తమ బాధ్యతగా భావిస్తున్నామని,తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని, వెల్లడించారు.ఈ ఈ కార్యక్రమంలో ఎండీ. షఫీ ఉన్న మున్సిపల్ వైస్ చైర్ పర్సన్. బైరు శైలేందర్,37 వ వార్డు కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు.

# ఐ కే పి కేంద్రన్ని ప్రారంభించిన సర్పంచ్ కొడారి సాంబరాజు



**జాఫర్ఘడ్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** ఉప్పుగల్ గ్రామం లో రైతులకు సౌకర్యంగా ఉండేందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశానుసారంగా వడ్లు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కొడారి సాంబరాజు హాజరైఐ కే పి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను సరైన ధరకు ప్రభుత్వానికి విక్రయించుకునేందుకు ఈ కొనుగోలు కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.మధ్యవర్తుల జోక్యం లేకుండా రైతులు నేరుగా తమ వడ్లు,ఐ కే పి కేంద్రంలో విక్రయించుకోవచ్చని చెప్పారు.అలాగే రైతులు ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ తమ పంటలను కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని విధాలుగా సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాట మధు,వార్డు సభ్యులు నేరెళ్ల రాజు, గంగాధరి యాదగిరి, వడ్లకొండ శ్రీలత-మధు, గాదెపాక ప్రణీత్, గాదెపాక కావేరి-అనిల్, బైరు సుకన్య-పవన్, దామెర మంజుల-రాజు,నల్లబోయిన నాగరాజు,ఎర్రం కవిత-శ్రీనివాస్, గోలి కవిత-అన్నారెడ్డి, కస్తూరి ఎల్లయ్య, గ్రామశాఖ అధ్యక్షులు లెంకల రాజు, జిల్లా కిషన్ సెల్ కో ఆర్డినేటర్ పోరెడ్డి సత్యనారాయణ రెడ్డి,న్యాయం జయపాల్ రెడ్డి,గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మండల ఏరియా ప్రాజెక్టు మేనేజర్ కుమార్,సిసి పరశురాములు,జి పి ఓ గుర్రం రమ్య,సి ఏ పూజారి శ్రీవాణి, సొంటిరెడ్డి విజయ ఐ కే పి కొనుగోలు కేంద్ర నిర్వాహకులు వంగ కోమల,మహమ్మద్ మహిబుబి,సంగి స్వరూప, తీగల లావణ్య,పూజారి విజయ హమాలీ లు గ్రామం రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన నున్నా రవికుమార్



**కూసుమంచి, కెరటం న్యూస్ ప్రతినిధి:** ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ రైతుల కష్టాలు తీర్చే నాధుడు కరువయ్యారని 15 రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేసినప్పటికీ కొనుగోలు చేయకపోవడం వల్ల రైతు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే రైతుల సమస్యల పరిష్కరించి ధాన్యం కొనుగోలు చేయాలని వెంటనే మిల్లును అలాట్మెంట్ చేయాలని బిజెపి పాలే నియోజవర్గ ఇన్చార్జి నున్నా రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలేరు గ్రామంలోని ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం బిజెపి నాయకులు తో కలిసి పరిశీలించారు అక్కడున్న రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు రైతుల సమస్యలు తెలుసుకున్నారు ఈ సందర్భంగా నిన్న రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఆర్థిక శాఖ మంత్రి వ్యవసాయ శాఖ మంత్రి రెవిన్యూ శాఖ మంత్రి ఉన్నప్పటికీ రైతుల సమస్యలను పరిష్కరించలేకపోతున్నారని ఆరోపించారు కొనుగోలు కేంద్రాల్లో దళారి వ్యవస్థ ఎక్కువైందని దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆయన సొంత నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాలు దళారి వ్యవస్థ పెరిగినప్పటికీ కనీసం పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆరోపించారు రక్షణమే ఈ సమస్యలను పరిష్కరించి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు రవి రాథోడ్ మాట్లాడుతూ నియోజవర్గంలో అత్యధికంగా మొక్కజొన్న పంట దిగుబడి వచ్చినప్పటికీ అరకొరగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను నట్టేట ముంచే ప్రయత్నం చేస్తున్న ప్రభుత్వం తక్షణమే మండలానికి రెండు మూడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పుణ్యవతి, మండల ప్రధాన కార్యదర్శిలు మహేందర్ నాయక్, వీరన్న, సీనియర్ నాయకులు దాసరి వెంకటేశ్వర్లు, మోతిలాల్, శ్రీకాంత్, కోటేశ్వరావు మరి కొంతమంది భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# విదేశీ విద్యా పథకం,ఓవర్సీస్ పెండింగ్ స్కాలర్షిప్స్ విడుదలకి అధికారులను కలిసిన, మోడేపల్లి




**హైదరాబాద్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** సోమవారం హైదరాబాద్ లో, విదేశీ విద్యా పథకం కి సంబంధించి, పెండింగ్ లో ఉన్న విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్షిప్స్ తక్షణమే విడుదల చేయాలని, సంక్షేమ ఆఫీస్ కి వెళ్లి సంబంధిత అధికారులను కలిసి స్కాలర్షిప్స్ విడుదలపై చర్చించారు. అనంతరం పేద విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్షిప్స్ సంక్షేమ భవన్ నందు, ఉన్నటువంటి మ్యూజియం ను సందర్శించారు. తదుపరి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అన్ని జిల్లాలలో ఉన్న బీసీ సమస్యల గురించి, సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, యువజన సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మరీద్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వగురు బస్వేశ్వర జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ద్వారంపూడి నాగిరెడ్డి.



**కుత్బుల్లాపూర్ , 20 ఏప్రిల్ (కెరటం న్యూస్):** 290 డివిజన్ సుభాష్ నగర్ 40 వ ఫీట్ రోడ్ లోని కర్ణభక్తుల సంక్షేమ సంఘ సభ్యుల ఆధ్వర్యం లో మహాత్మా విశ్వగురు బసవేశ్వర స్వామి వారి 893 వ జయంతి సందర్భంగా వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ద్వారంపూడి నాగిరెడ్డి, హాజరై బసవేశ్వరుని ప్రతిమకు పూలమాల వేసి సమాజానికి విశ్వగురు బసవేశ్వరుని సేవలను కొనియాడారు,సమాజంలో కులవ్యవస్థను, వర్ణభేదాలను,లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయవాది,తాను బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినా అన్ని కులాలు ఒకటేనని,ఒక అనుభవ మండపం స్థాపించి సమానత్వం కోసం కృషి చేసిన మహా గురు బస్వేశ్వర స్వామి అని కొనియాడారు అనంతరం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి సంగ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అన్నదాన కార్యక్రమం 1000 మందికి నిర్వహించడం జరిగింది ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు సూర్యచంద్రరావు,మల్లికార్జున రావు ,మల్లేశ్వరరావు శివాజీ గణేష్,నాగభూషణం,సత్యనారాయణ,సూరిబాబు, మొదలైనవారు,సాయి,ఈశ్వర్ రావు,ఓబుల్ రెడ్డి,మేస్త్రీ రాజు,ఇద్దె గౌడ్ ,గణేష్ రెడ్డి ,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

# కెనడా కెప్టెన్‌పై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు.. ఐసీసీ నజర్‌లో దిల్‌ప్రీత్ బజ్వా



స్పోర్ట్స్ న్యూస్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్): ఇటీవల వరల్డ్‌కప్‌లో ఆడిన కెనడా జట్టు టీ20 కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వాపై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు వచ్చాయి. అంతర్జాతీయ క్రికెట్ మండలికి చెందిన అవినీతి నిరోధక యూనిట్ ఆ ఆరోపణలపై దర్యాప్తు చేపడుతున్నది. టీ20 వరల్డ్‌కప్ సమయంలో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో దిల్‌ప్రీత్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. పంజాబ్‌లోని బాటాలాలో జన్మించాడు దిల్‌ప్రీత్. అతని వయసు 24 ఏళ్లు. వరల్డ్‌కప్‌లో అతని ఆటతీరుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కెనడా, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌పై ఏసీయూ దర్యాప్తు చేపడుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 17వ తేదీన ఆ మ్యాచ్ జరిగింది. న్యూజిలాండ్ 174 రన్స్ చేజింగ్ చేస్తున్న సమయంలో 35-2 స్కోరు వద్ద అకస్మాత్తుగా దిల్‌ప్రీత్ బజ్వా బౌలింగ్ చేశాడు. అతను తన తొలి ఓవర్‌లో నోబ్‌లు, వైడ్‌లు వేశాడు. మొత్తం 15 రన్స్ ఇచ్చాడు. కానీ అనూహ్యంగా అతను బౌలింగ్ చేయడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మ్యాచ్ కీలక దశలో ఉన్నప్పుడు బజ్వా బౌలింగ్ చేసినట్లు తెలుస్తోంది. దీనిపై ఏసీయూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నది. స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడిన బౌలర్లు.. కావాలని నోబ్ లేదా వైడ్ వేసే అవకాశాలు ఉంటాయి. ఆ కోణంలో బజ్వాపై విచారణ జరగనున్నది.

ఇటీవల కెనడా టీవీలో ఓ డాక్యుమెంటరీ ప్రసారమైంది. కరప్షన్, క్రైం, క్రికెట్ అన్న టైటిల్‌తో ఆ డాక్యుమెంటరీ ప్రజెంట్ చేశారు. టీం సెలెక్షన్‌తో పాటు బజ్వాను కెప్టెన్‌గా ఎంపిక చేయడం పట్ల అనుమానాలు వ్యక్తం చేశారు. కివీస్‌తో జరిగిన మ్యాచ్‌లో కెనడా ఓటమి పాలైంది. కానీ ఆ మ్యాచ్‌లో బెట్టింగ్ లాంటి ఆరోపణలను కూడా ఏసీయూ దర్యాప్తు చేయనున్నది. ఫోన్, కమ్యూనికేషన్ రికార్డులను పరిశీలిస్తారు. ప్రస్తుతం ఆ క్రికెటర్‌పై ఎటువంటి అభియోగాలు నమోదు కాలేదు. కానీ అతని వ్యవహార శైలిపై అనుమానాలు రావడంతో దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిసింది.

పంజాబ్ దేశవాళీ క్రికెట్‌లో చోటు దక్కకపోవడంతో గురుదాస్‌పూర్‌కు చెందిన దిల్‌ప్రీత్ బజ్వా 2020లో కెనడా వెళ్లాడు. గ్లోబల్ టీ20 కెనడా లీగ్‌లో అతను పేరు సంపాదించుకున్నాడు. మాంట్రియల్ టైగర్స్ తరపున ఆడిన అతను ఓ సెంచరీ కొట్టి అందరి దృష్టిలో పడ్డాడు. 2026లో కెనడా జాతీయ క్రికెట్ జట్టుకు కెప్టెన్ అయ్యాడు. జాతీయ క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించిన తొలి సిక్కుగా రికార్డు క్రియేట్ చేశాడు. అయితే కెనడా ఇంటెలిజెన్స్ ప్రకారం క్రికెట్ బెట్టింగ్, ఫిక్సింగ్‌లో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్నారు. కెనడాలోని సర్రే, బ్రిటీష్ కొలంబియా జట్ల ఆటగాళ్లను బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరించినట్లు తెలుస్తోంది.

కావాలని నోబ్, వైడ్ వేసినట్లు అనుమానాలు వ్యక్తం కావడంతో ప్రస్తుతం బజ్వాను ఐసీసీ విచారిస్తున్నది. అతని ఫోన్‌ను సీజ్ చేసింది. డెల్టా, బీసీ, ఆర్సీఎంపీ రాష్ట్రాలకు చెందిన కెనడా పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. బెదిరింపులు, కాల్పుల ఘటనలకు లింకులు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. కెనడా పోలీసులు, కెనడా క్రికెట్ ప్రకారం మాత్రం బజ్వాపై ఇంకా ఎటువంటి నేరం రుజువుకాలేదు.

# ముంబైకి రిలీఫ్..గుజరాత్ పై గ్రాండ్ విక్టరీ



స్పోర్ట్స్ న్యూస్, 20 ఏప్రిల్ (కెరటం న్యూస్): ఎట్టకేలకు ముంబై ఇండియన్స్ విక్టరీ కొట్టింది. ఐపీఎల్ 2026లో వరుసగా నాలుగు మ్యాచ్ లలో ఓడిపోయిన ముంబై, ఇవాళ జరిగిన మ్యాచ్ లో మాత్రం అదరగొట్టింది. తన ప్రత్యర్థి గుజరాత్ టైటాన్స్ ను చిత్తు చేసి 99 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది ముంబై ఇండియన్స్. గుజరాత్, ముంబై మధ్య మోడీ స్టేడియం వేదికగా మ్యాచ్ జరిగింది. ఇందులో ముంబై ఇండియన్స్ ఫస్ట్ బ్యాటింగ్ చేసింది. ఈ తరుణంలోనే 20 ఓవర్లు ఆడిన ముంబై ఇండియన్స్, ఐదు వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. ఈ ఇన్నింగ్స్ లో తిలక్ వర్మ అద్భుతమైన సెంచరీ చేసి, తన సత్తా చాటాడు.

అదరగొట్టిన తిలక్ వర్మ..ముంబై రెండో విజయం

ఇక ముంబై విధించిన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో గుజరాత్ టైటాన్స్ తేలిపోయింది. ఏ ఒక్కరూ రాణించలేదు. వాషింగ్టన్ సుందర్ ఒక్కడే 26 పరుగులతో ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. మిగిలిన ప్లేయర్లు చేతులెత్తేసిన నేపథ్యంలో 15.5 ఓవర్లలో 100 పరుగులు చేసి ఆలౌట్ అయింది గుజరాత్ టైటాన్స్. కాగా, ముంబై బౌలర్లలో అశ్వని కుమార్ 4 వికెట్లు పడగొట్టగా, శాంట్నర్, ఘజన్‌ఫర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. బుమ్రా, పాండ్యాకు తలో వికెట్ పడింది. దీంతో ఈ టోర్నమెంటులో రెండో విజయాన్ని నమోదు చేసుకుంది ముంబై. పాయింట్ల పట్టికలో 9వ స్థానం నుంచి ఏడో స్థానానికి ఎగబాకింది. గుజరాత్ టైటాన్స్ ఆరో స్థానంలో కొనసాగుతోంది. మొదటి స్థానంలో పంజాబ్ కింగ్స్ ఉండగా, చిట్ట చివరన కేకేఆర్ నిలిచింది.


# ఇకపై ఆలా చెయ్యను




తెలుగు సినిమా పరిశ్రమలో మంచి గుర్తింపు కలిగిన దర్శకుడు మరియు నటుడు అయిన తరుణ్ భాస్కర్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈయన పెళ్లి చూపులు చిత్రంతో దర్శకుడిగా కెరీర్‌ను ప్రారంభించాడు. ఆ తర్వాత ఈ నగరానికి ఏమైంది చిత్రాన్ని తెరకెక్కించాడు. ఈ రెండు సినిమాల తర్వాత తరుణ్ భాస్కర్ దర్శకత్వం చేయడం కంటే సినిమాల్లో నటించడంపై ఎక్కువ ఆసక్తి చూపించాడు. తాజాగా ఈయన గాయపడ్డ సింహం అనే చిత్రంలో హీరోగా నటించాడు. మే 1వ తేదీన ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ మూవీ విడుదల తేదీ దగ్గర పడడంతో తాజాగా ఈయన ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అందులో భాగంగా ఈ దర్శకుడు కొన్ని ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు.

తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ, ప్రస్తుతానికి నేను కొన్ని ప్రాజెక్టులకు కమిట్ అయి ఉన్నాను. అవి దాదాపు వచ్చే రెండేళ్లలో పూర్తి అవుతాయి. నేను వరుసగా కామెడీ చిత్రాలు చేస్తూ వస్తున్నాను. ఇకపై నా రూట్ మార్చాలి అనుకుంటున్నాను. కామెడీ సినిమాలు కాకుండా సందీప్ రెడ్డి వంగా, ఆదిత్య ధర్, భరత్ కమ్మ మాదిరిగా బలమైన డ్రామా కలిగిన చిత్రాలను చేయాలని అనుకుంటున్నాను. ప్రస్తుతం నేను కమిట్ అయిన సినిమాలు పూర్తి చేసిన తర్వాత అదే పనిలో ఉంటానని ఈ దర్శకుడు తెలిపారు. తాజాగా తరుణ్ భాస్కర్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి.

# ఆయుష్మాన్ చిక్కుల్లో రకుల్ మ్యాజిక్



బాలీవుడ్ ప్రేక్షకులను నవ్వించేందుకు 'పతివర్స్' ప్రపంచం మళ్ళీ సిద్ధమైంది. ఈసారి ఈ పతీ-పత్నీల గందరగోళంలో మన టాలీవుడ్ స్టార్ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ మెరవబోతోంది. ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటిస్తున్న 'పతి పత్ని ఔర్ వో దో' సినిమా టీజర్ తాజాగా.. విడుదలై సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఇందులో రకుల్ తో పాటు సారా అలీ ఖాన్, వామికా గబ్బి కూడా నటిస్తున్నా, రకుల్ గ్లామర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ టీజర్‌ను చాలా వెరైటీగా ప్లాన్ చేశారు. ప్రసిద్ధ 'మహాభారత' సిరీస్‌లోని మై సమయ్ హూన్ అనే గంభీరమైన వాయిస్ ఓవర్‌తో ప్రారంభం కాగా.. కాలం మారుతున్నా, యుగాలు గడుస్తున్నా భర్తల అవిశ్వాస స్వభావం మాత్రం మారదని చమత్కరిస్తూ.. గతంలో వచ్చిన సంజీవ్ కుమార్, కార్తీక్ ఆర్యన్ల క్లిప్పింగ్స్‌ను చూపించారు. ఇక చివరలో ఈ కొత్త తరం పతిగా ఆయుష్మాన్ ఖురానాను, ఆయన లైఫ్‌లోకి వచ్చే 'వో' (ఆమె) లలో ఒకరిగా రకుల్ ప్రీత్ సింగ్ ను చూపించడం అదిరిపోయింది.

ఈ సినిమాలో రకుల్ పాత్ర చాలా సందడిగా, స్టైలిష్‌గా ఉండబోతోందని టీజర్ చూస్తే అర్థమవుతోంది. ఆయుష్మాన్ ఖురానా ముగ్గురు అందగత్తెల మధ్య చిక్కుకుని పడే పాట్లు, ఆ గందరగోళంలో రకుల్ ఇచ్చే ఎక్స్‌ప్రెషన్స్ ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించనున్నాయి. రకుల్ తనదైన కామెడీ టైమింగ్‌తో ఈ 'పతివర్స్'లో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనుంది. ఇక ఈ టీజర్‌ను విడుదల చేస్తూ.. "కాలం అన్నింటినీ మారుస్తుంది...కానీ భర్తల స్వభావంపై దానికి కూడా ఏమాత్రం నియంత్రణ లేదు. ప్రజాపతి పాండే వస్తున్నాడు... ఈసారి, తన భార్యతోనూ, ఆ మరో ఇద్దరితోనూ కలిసి సందడి చేయనున్నాడు" అనే క్యాప్షన్ జత చేసింది. ముదస్సర్ అజీజ్ దర్శకత్వంలో, టి-సిరీస్,బి.ఆర్. స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ కామెడీ చిత్రం మే 15న థియేటర్లలోకి రాబోతోంది. వేసవి సెలవుల్లో రకుల్ ప్రీత్ సింగ్ తన నటనతో, గ్లామర్‌తో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.